

గాంధీజయంతికి లక్షన్నర మొక్కలు

గాంధీ జయంతిన జిల్లావ్యాప్తంగా 175.2 కి.మీ పొడవున లక్షన్నర మొక్కలు ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలని అధికారులు నిర్ణయించారు.

- 8లో..



గొర్రెల కాపరి దారుణ హత్య

గొర్రెల కాపరి దారుణ హత్యకు గురైన ఘటన మంగళవారం మార్కాపురం మండలం ఇడుపూరు గ్రామ శివారులో జరిగింది.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37/29

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నలుగురికి కారుణ్య నియామకాలు



నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు: కారుణ్య నియామకం కింద జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యం పరిధిలో నలుగురికి ఉద్యోగ నియామక ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో బి.జాలిరెడ్డిలు మంగళవారం జెడ్పీ కార్యాలయంలో అందించారు. జూనియర్ సహాయకులుగా టీపీఎల్ శివనాగ ప్రసాద్(ఉలవపాడు మండలం చాకిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), యం.గిరిజ (బేస్త వారిపేట మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), ఆఫీస్ సబార్డినేట్‌లుగా టి.వెంకట శేషమ్మ (ఒంగోలు ఎంపీడీవో కార్యాలయం), యస్.సందీప్ (కొరిశపాడు ఎంపీడీవో కార్యాలయం) ఈ ఉత్తర్వులు అందుకున్నారు.

పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి సస్పెన్షన్

ఒంగోలు: పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించినందుకు ఒంగోలు నియోజకవర్గానికి చెందిన పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

23న జిల్లా స్థాయిలో సైన్స్ సెమినార్

ఒంగోలు: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం (ఎన్‌సీఎస్‌ఎం, బెంగళూరు విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం (వీఐటీఎం)లు జాతీయ స్థాయిలో నిర్వహించే సైన్స్ సెమినార్ జిల్లా స్థాయి పోటీలు ఈనెల 23న స్థానిక పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిల్లెట్స్- ఏ సూపర్ ఫుడ్ లేదా ఏ డైట్ ఫుడ్ అనే అంశంపై సెమినార్ జరుగుతుందన్నారు. దీనికి 8, 9, 10 తరగతుల విద్యార్థులు అర్హులు. సెమినార్‌లో ఒక్కో విద్యార్థికి 5 నిముషాల సమయం కేటాయిస్తారని, పోటీలో పాఠశాల నుంచి ఒక విద్యార్థి పాల్గొని గరిష్టంగా 5 పోస్టర్లు/చార్టులు, పీపీటీ స్లైడ్ సాయంతో అంశాన్ని ఆంగ్లం లేదా తెలుగులో వివరించాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమస్థానం పొందిన విద్యార్థి రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని, పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్, సెల్ నంబర్ 9666955504ను సంప్రదించాలన్నారు.

ప్రైవేటు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు: 2024 మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే ప్రైవేటు విద్యార్థులు (2023 ఏప్రిల్/ జూన్ లో జరిగిన పరీక్షలలో తప్పిన విద్యార్థులు) పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఫీజును ఈనెలాఖరులోగా అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో అక్టోబరు 5వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో అక్టోబరు 11వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో అక్టోబరు 16వ తేదీ వరకు ఫీజును సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్స్ లింకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని, ప్రధానోపాధ్యాయులు తమకు కేటాయించిన యూజర్ ఐడీ, పాస్‌వర్డు ద్వారా లాగిన్ కావాలన్నారు. మూడు సబ్జక్టుల వరకు రూ.110, మూడు సబ్జక్టులకు మించితే రూ.125, మైగ్రేషన్ సర్టిఫికెట్ అవసరమైతే రూ.80 చెల్లించాలన్నారు.

డీసీఈబీ కాంట్రిబ్యూషన్‌ను 30లోగా చెల్లించాలి

ఒంగోలు: జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్స్ ఈ ఏడాది జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు ప్రశ్నపత్రాల కోసం చెల్లించాల్సిన కాంట్రిబ్యూషన్‌ను ఈనెల 30వ తేదీలోగా చెల్లించాలని జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు అధ్యక్షుడు వీఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల స్ట్రెంథ్ ఫారం, బ్యాంకు కౌంటర్ ఫైల్, పాఠశాల రికగ్నిషన్ కాపీ జతచేసి జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యాలయం, ఒంగోలుకు పోస్టు చేయడం లేదా స్వయంగా సమర్పించాలన్నారు. ఈనెలాఖరులోగా డీసీఈబీ కాంట్రిబ్యూషన్ చెల్లించకపోతే అపరాధ రుసుముతో కలిపి చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఏక దంతాయ.. భిన్నరూపాయ



ఒంగోలు రాజపానగల్ 4వ లైన్‌లో అడవిలో పులిపై విహరిస్తున్న వినాయకుడి విగ్రహం



సింగరాయకొండలో ఏర్పాటు చేసిన స్వర్ణకాంతుల గణపతి



మార్కాపురం నెహ్రూబజారులో దశావతార గణపతి



ఒంగోలు అంకమ్మపాలెం కృష్ణమందిరం వద్ద పంచముఖ గణపతి



పెద్దదోర్నాల వాసవీమాత ఆలయంలో గాజులతో తయారుచేసిన గణేశుని ప్రతిమ

ఆది పూజనందుకునే విఘ్నపతి..సర్వకార్యసిద్ధి కలిగించే వరసిద్ధి వినాయకుడు వినాయకచవితి పర్వదినాన జిల్లాలో భక్తులు ఏర్పాటు చేసిన మండపాల్లో విభిన్న రూపాల్లో కొలువుదీరాడు. వాడవాడలా ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో భారీ వినాయక ప్రతిమలను ఉంచి ప్రజలు భక్తితో పూజించారు. - సాక్షి నెట్‌వర్క్

- మరిన్ని చిత్రాలు 8లో

సిరుల తీరం..

అపారమైన మత్స్య సంపద ఉమ్మడి ప్రకాశం తీరం సొంతం. మెకనైజ్డ్ బోట్లలో వేటకు వెళ్లి లభించిన మత్స్య సంపదను తీరానికి చేరవేసే సమయంలో గంగపుత్రులు పడుతున్న కష్టాలు అన్నీ, ఇన్నీ కావు.. ఇప్పటి వరకూ మెకనైజ్డ్ బోట్లు ఆపాలంటే కృష్ణపట్నం, మచిలీపట్నం తీరాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. మత్స్యకారుల కష్టాలు విన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చీరాల, కొత్తపట్నం వద్ద హార్బర్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. భూ సేకరణతోపాటు టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. త్వరలో సీఎం భూమిపూజ చేయనున్నారు.

ఇవి పూర్తయితే కడలి పుత్రుల జీవన ప్రమాణాల్లో పెను మార్పులు రానున్నాయి. ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవనున్నాయి.



కొత్తపట్నం సముద్రతీరం

ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించిన పూర్తి వివరాలు

- సముద్ర తీరం 102 కిలో మీటర్లు
- తీరంవెంట మండలాలు 11
- మత్స్యకార గ్రామాలు 74
- మత్స్యకార జనాభా 88,000
- మెకనైజ్డ్ బోట్లు 39
- మోటరైజ్డ్ బోట్లు 2440
- సాంప్రదాయ తెప్పలు 907
- సముద్రంలో చేపలు బాగా ఉత్పత్తి అయ్యే ఏరియా 3859 చ.కి.మీ

- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రెండు ఫిషింగ్ హార్బర్లు
- కొత్తపట్నం, చీరాల మండలం వాడరేవుల్లో నిర్మాణానికి రంగం సిద్ధం
- టెండర్ల ప్రక్రియ పూర్తి
- రెండింటికి 67.71 ఎకరాల కేటాయింపు
- మొత్తం రూ.813 కోట్లు వెచ్చించి నిర్మాణం
- 650 నుంచి 1000 మెకనైజ్డ్ బోట్లు బెర్తుల్లో నిలిపేందుకు వీలుగా డిజైన్
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల మంది మత్స్యకారులు ఉపాధి పొందే అవకాశం
- మత్స్య సంపద ద్వారా మత్స్యకారుల జీవితాల్లో సిరులు కురిపించనున్న వైనం
- త్వరలో సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా భూమి పూజ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో మత్స్యకారుల అవస్థలు గమనించారు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రెండు ఫిషింగ్ హార్బర్లు మంజూరు చేశారు. ఒంగోలు నగరానికి సమీపంలోని కొత్తపట్నం సముద్ర తీరంలో ఒకటి, చీరాల మండలం వాడరేవు సముద్ర తీరంలో మరొకటి నిర్మించేందుకు పరిపాలనా పరమైన అన్ని అనుమతులను ప్రభుత్వం ఇచ్చింది. జ్యుడీషియల్ ప్రివ్యూ పూర్తయింది. తర్వాత కార్యాచరణలో భాగంగా అన్ని రకాల అనుమతులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చాయి. ఏపీ మారిటైమ్ బోర్డు టెండర్ల ప్రక్రియను సైతం పూర్తి చేసింది. భూ సేకరణతో పాటు అన్ని రకాల అనుమతులు పూర్తయ్యాయి. త్వరలో కొత్తపట్నంలో హార్బర్ పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పనులు ప్రారంభించనున్నారు.

బంగాళాఖాతంలో మత్స్య సంపదను వేటాడి తద్వారా సులభతరంగా మెకనైజ్డ్ బోట్ల ద్వారా ఒడ్డుకు చేర్చుకునేలా ఈ ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టనున్నారు. వీటి ఏర్పాటు ద్వారా జిల్లా మత్స్యకారులతో పాటు అటు బాపట్ల, ఇటు నెల్లూరు జిల్లాలకు చెందిన వారికి ఎంతగానో ఉపయోగపడతాయి. సముద్రంలో వేటాడిన మత్స్య సంపదను సులువుగా తీరానికి చేర్చడంతో పాటు మెకనైజ్డ్ బోట్లను ఒడ్డుకు తీసుకొచ్చి నిలుపుకునేలా వీటి నిర్మాణం చేయనున్నారు. ఈ రెండు హార్బర్ల ద్వారా 650 నుంచి 1000 మెకనైజ్డ్ బోట్లు నిలిపేందుకు వీలుగా బెర్తులు ఏర్పాటు చేయనున్నారు.

రూ.813 కోట్లతో రెండు హార్బర్లు

కొత్తపట్నం, చీరాల వాడరేవుల వద్ద రెండు హార్బర్లు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.813 కోట్లు ఇప్పటికే మంజూరు చేసింది. అందుకోసం రెండు ప్రాంతాల్లో 67.71 ఎకరాలు కేటాయించి రెవెన్యూ అధికారులు ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డుకు అప్పగించారు. కేటాయించిన స్థలాలకు సంబంధించిన అన్నిరకాల అనుమతులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేశారు. కొత్తపట్నం సముద్ర తీరంలో నిర్మించే హార్బరుకు రూ.392 కోట్లు మంజూరు చేసింది. అందుకుగాను 32 ఎకరాలు కేటాయించింది. చీరాల మండలం వాడరేవు హార్బర్ నిర్మాణానికి రూ.421 కోట్లు మంజూరు చేసింది. అందుకుగాను 35.71 ఎకరాలను కేటాయించింది.

40 వేల మంది మత్స్యకారులకు ప్రయోజనం: ఈ రెండు ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం పూర్తయితే జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 40 వేల మంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూరనుంది. కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్‌లో 20 వేల మందికి, ఓడరేవు ఫిషింగ్ హార్బర్‌లో మరో 20 వేల మందికి అదనంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. మత్స్యకారుల కుటుంబాల్లో ఆనందం రెట్టింపు కానుంది. ఇదిలా ఉండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన 2019 జూన్ నెల నుంచి మత్స్యకారులకు ప్రతి సంవత్సరం రూ.270 కోట్లకు పైగా ప్రయోజనం చేకూరుతోంది. మొత్తం 44,506 మంది మత్స్యకారులు వివిధ పథకాల్లో లబ్ధిదారులుగా ఉన్నారు.



కొత్తపట్నం మండలంలోని పల్లెపాలెంలో నిర్మించనున్న ఫిషింగ్ హార్బర్ డిజైన్

జిల్లాలోని మత్స్యకారులకు గొప్ప వరం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రెండు హార్బర్లు ఏర్పాటు చేయటం మత్స్యకారులకు ఒక గొప్ప వరం. వారికి చేతినిండా పనిదొరుకుతుంది. జిల్లా నుంచి మత్స్య సంపదను ఎక్కువ మొత్తంలో ఎగుమతులు చేయటానికి కూడా వీలుకలుగుతుంది. తద్వారా ప్రతి కుటుంబం ఆర్థికంగా బాగా నిలదొక్కుకునే అవకాశం ఏర్పడుతుంది. వారి జీవన ప్రమాణాల్లో మెరుగైన ఫలితాలు లభిస్తాయి. ఇకనుంచి మత్స్యకారులు చెన్నై, కాకినాడ, భీమునిపట్నం, విశాఖపట్నంతో పాటు గుజరాత్‌లాంటి రాష్ట్రాలకు ఉపాధి కోసం వెళ్లాల్సిన అవసరం లేదు. మత్స్య పారిశ్రామికవేత్తల చూపు ఇక నుంచి జిల్లాపై పడుతుందనటంలో సందేహం లేదు.

– ఆవుల చంద్రశేఖర రెడ్డి, జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్

23న హ్యాండ్‌బాల్ ఎస్‌జీఎఫ్ జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హ్యాండ్‌బాల్ అండర్ 14, అండర్ 17 బాలబాలికల జట్ల ఎంపిక ఈనెల 23న తాళ్లూరు మండలం తూర్పుగంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికకు పూర్వ ప్రకాశం జిల్లాలోని 56 మండలాల్లోని విద్యార్థినీ విద్యార్థులు అర్హులు. ఎంపికలో పాల్గొనేవారు తప్పకుండా అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకుని ఉండాలని, అండర్ 17 కేటగిరీలో పాల్గొనే విద్యార్థులు ఇంటర్ చదువుతున్న విద్యార్థులు అయి ఉండాలన్నారు. వారు తప్పనిసరిగా పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబర్, సంబంధిత ప్రిన్సిపాల్ ధ్రువీకరణతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9666702555 నంబర్ ను సంప్రదించాలన్నారు.

ఎల్ఐసీ ఏఓఐ నెల్లూరు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.వెంకట్రావు



బి.వెంకట్రావు

ఒంగోలు: ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ ఏఓఐ) నెల్లూరు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.వెంకట్రావు ఎన్నికయ్యారు. సోమవారం నెల్లూరులో జరిగిన నెల్లూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంల ఏకగ్రీవంగా ఎంపికచేసినట్లు డివిజన్ అధ్యక్షుడు బెజవాడ శివయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న రాజశేఖర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక కావడంతో ఈ నియామకం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో వెంకట్రావు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా, సీఐటీయూ ఒంగోలు నగర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఎల్ఐసీ పరిరక్షణ కోసం అక్టోబరు 9న జోనల్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏజెంట్లకు వెంకట్రావు విజ్ఞప్తి చేశారు.

టీటీడీ కల్యాణ మండపాలకు నిధులు మంజూరు

- త్రిపురాంతకంలో నూతన నిర్మాణానికి రూ.2 కోట్లు
- యర్రగొండపాలెంలో అదనపు నిర్మాణాలకు రూ.60 లక్షలు
- మంత్రి ఆదిమూలపు సురేష్ చొరవతో లభించిన పరిపాలన అనుమతులు



వైపాలెంలో నిర్మాణంలో ఉన్న టీటీడీ కల్యాణ మండపం

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ వైపాలెం నియోజకవర్గంలో తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపాల నిర్మాణాలపై ప్రత్యేక చొరవ చూపడంతో రూ 2.60 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఆ దేవస్థానం సీఈ పరిపాలన అనుమతులను జారీ చేసింది. నియోజకవర్గంలో ఆధ్యాత్మిక కేంద్రమైన త్రిపురాంతకంలో నూతనంగా టీటీడీ కల్యాణ మండపాన్ని నిర్మించాల్సిన అవశ్యకత ఉందని మంత్రి కోరడంతో అక్కడ కల్యాణ మండపం నిర్మాణానికి రూ.2 కోట్లు టీటీడీ ఇంజినీరింగ్ శాఖ మంజూరు చేసింది. త్రిపురాంతకంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా ఎకరా భూమిని తిరుమల తిరుపతి దేవస్థానానికి అందచేయాల్సి ఉంది. ప్రజల తమ వాటా కింద రూ.40 లక్షలు దేవస్థానానికి జమ చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే టీటీడీ దేవస్థానం రూ.2 కోట్లతో కల్యాణ మండప నిర్మాణాలను చేపడుతుంది. యర్రగొండపాలెంలో రూ.1 కోటి 74 లక్షలతో నిర్మిస్తున్న టీటీడీ కల్యాణ మండపం దాదాపు పూర్తి కావస్తోంది. అయితే ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు భోజనశాల డిజైన్‌ను పూర్తిగా మార్పుచేయటానికి అదనంగా రూ.60 లక్షలు టీటీడీ మంజూరు చేసింది. గతంలో భోజనశాల కోసం ఫస్ట్ ఫ్లోర్‌లో రేకుల షెడ్డు నిర్మించాల్సిఉంది. అయితే మంజూరైన నిధులతో భోజన శాల స్థానంలో కల్యాణ మండపం పక్కా స్లాబ్‌తో నిర్మాణం చేపడతారు. ఇప్పటికే పూర్తయిన కింది భాగంలో భోజనశాలగా ఏర్పాటు చేయటానికి డిజైన్‌ను మార్పు చేశారు. త్రిపురాంతకంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి, యర్రగొండపాలెంలో ప్రజల సౌకర్యార్థం టీటీడీ కల్యాణమండపం డిజైన్‌ను మార్చి నిధులు మంజూరు చేయించిన మంత్రి ఆదిమూలపు సురేష్‌కు ఆయా ప్రాంతాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. యర్రగొండపాలెంలో కల్యాణ మండపం నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, ప్రస్తుతం చేసిన డిజైన్ మార్పుతో ఫస్ట్ ఫ్లోర్ స్లాబ్ త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కాంట్రాక్టర్ ఉడుముల కోటిరెడ్డి తెలిపారు.

22 నాటికి పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పూర్తి

- రాష్ట్ర ఎన్నికల అధికారికి తెలిపిన కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇతర అధికారులు

ఒంగోలు అర్బన్: పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రేషనలైజేషన్ ప్రక్రియ ఈ నెల 22 నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ రాష్ట్ర ఎన్నికల అధికారికి తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా కలెక్టర్‌లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. దీనిలో జిల్లాకు సంబంధించి కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరాలను తెలిపారు. క్లైయిమ్స్, అభ్యంతరాలను పూర్తిగా పరిష్కరించామన్నారు. ఇంటింటి సర్వేలో సేకరించిన ఫారమ్ 6, 7, 8లను మరొక్క రోజులో పూర్తి చేస్తామని చెప్పారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

ఎపిక్ కార్డులకు సంబంధించి ఫేజ్-1 పూర్తి అయిందని ఫేజ్-2,3లకు సంబంధించి పోస్టల్ ద్వారా డిస్పాచ్ చేస్తున్నట్లు వివరించారు. దీనిలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్, నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

మాన్యువల్ స్కావెంజింగ్‌ను నిషేధించాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



సమావేశం నిర్వహిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: మాన్యువల్ స్కావెంజింగ్ ఉపాధిని పక్కాగా నిషేధించాలని, వారికి పునరావాస చట్టంపై అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ప్రకాశం భవనంలో మాన్యువల్ స్కావెంజింగ్ ఉపాధి నిషేధంపై జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను మాన్యువల్ స్కావెంజర్స్ ఫ్రీగా ప్రకటించాలన్నారు. ఇప్పటి వరకు ప్రకటించిన మున్సిపాలిటీలు, గ్రామాలు ఉంటే ఒక నెలలో స్వచ్ఛతా అభియాన్ మొబైల్ యాప్‌లో తగిన వివరాలను అప్‌లోడ్ చేసి ప్రకటించాలన్నారు. పంచాయతీల పరిధిలో సఫాయి కార్మికులకు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, వారికి అందాల్సిన రైన్ కోట్‌లు ఇతర సామగ్రి తప్పక అందించాలన్నారు. సమావేశానికి జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి లక్ష్మానాయక్ అధ్యక్షత వహించారు. దీనిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, హౌసింగ్ అధికారి పేరయ్య, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, డీపీవో నారాయణరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైద్యశాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం)లో ఎన్‌సీడీ ప్రోగ్రాంలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్, ఫిజియోథెరపిస్ట్, మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్ ఉద్యోగాలను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు పబ్లిక్ హాలిడేస్ మినహాయించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అప్లికేషన్, సర్వీస్ సర్టిఫికెట్ నమూనాలతో పాటు నివాస ధ్రువీకరణతో జిల్లా వెబ్‌సైట్ prakasam.ap.gov.in లో డౌన్‌లోడ్ చేసుకుని 28వ తేదీ సాయంత్రం 5గంటల లోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. గడువు ముగిసిన తర్వాత దరఖాస్తులు స్వీకరించరని తెలిపారు.

గౌరీ నందన.. గజాననా..

ఊరూవాడా వేడుకగా గణేశ్ చతుర్థి సంబరాలు



దర్శిలోని పుచ్చలమిట్టలో మట్టి గణపతికి పూజలు



ఒంగోలు మున్సిపల్ ఆఫీస్ ఎదుట భారీ గణేశుడు

వినాయక చవితి సంబరాలు సోమవారం అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. గణేశ్ నవరాత్రి ఉత్సవాల కోసం జిల్లాలో వాడవాడలా లంబోదరుడి మండపాలను సుందరంగా ముస్తాబు చేశారు. మిరుమిట్లు గొలిపే మండపాల్లో ఠీవీగా ఆసీనుడైన గణనాథుడిని శరణు కోరుతూ భక్తులు విశేష పూజలు చేశారు. విఘ్నాలు తొలగించి.. విజయం సిద్ధింపజేయాలని, విజ్ఞానాన్ని ప్రసాదించాలని గణాధిపుడిని మనసారా వేడుకున్నారు. కాగా, జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, సరదా క్రీడలతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. రెండో రోజు మంగళవారం గణేశ్ నిమజ్జనాలు కోలాహలంగా సాగాయి. - సాక్షి నెట్‌వర్క్



ఒంగోలు కొణిజేడు బస్టాండ్ సెంటర్‌లో కొలువుదీరిన దశావతార లంబోదరుడు



రంగుతోటలో కుప్పం ప్రసాద్ ఆధ్వర్యంలో కలశాల విగ్రహం



కంభం పట్టణంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు




పుల్లలచెరువులోని గాంధీ కళాక్షేత్రంలో..



కంభం చెరువులో గణేశ్ విగ్రహ నిమజ్జనం



పామూరులో పంచముఖ గణపతికి భక్తుల పూజలు



ఒంగోలు రాజపానగల్ రోడ్డులో బాలగణపతి

క్లుప్తంగా

నేడు పొదిలిలో కలెక్టర్ ప్రత్యేక స్పందన

పొదిలి: కలెక్టర్ ఆధ్వర్యంలో మండల స్థాయి స్పందన కార్యక్రమం బుధవారం పొదిలిలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రథం రోడ్డులోని శ్రీసాయి బాలాజీ కళ్యాణ మండపంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు ఇవ్వవచ్చని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

కారు ఢీకొని రైతు మృతి



బాబూరావు మృతదేహం

పామూరు: కారు ఢీకొని రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వేములపల్లివద్ద 565వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. ఎస్సై సురేష్‌యాదవ్ తెలిపిన వివరాలు... బాపట్ల జిల్లా కొల్లూరు మండలం జువ్వలపాలెంకు చెందిన ఉదరవల్లి బాబూరావు, కిష్టమ్మ దంపతులు 3 ఏళ్ల నుంచి నుంచి వేములపల్లి వద్ద భూములను కౌలుకుతీసుకుని సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో వగ్గంపల్లె గ్రామానికి వచ్చి ఇంటికి వెళుతున్న సమయంలో పామూరు నుంచి కనిగిరి వెళుతున్న కారు వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్సై సురేష్ కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి తరలించారు.

ఇంటి సమీపంలోనే దుర్మరణం...

కొద్ది నిముషాల్లో ఇంట్లోకి వెళ్లనుండగా కారు రూపంలో బాబూరావును మృత్యువులు కబళించింది. అప్పటివరకు తనతో ఉన్న భర్త అల్పాహారం తిని వచ్చేందుకు వెళ్లి ఇలా ఇంటి సమీపంలో మృత్యువాత పడటంతో భార్య కిష్టమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సామ్యేలు మృతదేహం

పీసీపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన టి.సామ్యేలు(26) వృత్తిరీత్యా బేల్దారి పనిచేస్తుంటాడు. మూడేళ్ల క్రితం హనుమంతునిపాడు మాసాయిపేటకు చెందిన మనితో వివాహమైంది. వీరికి మూడు నెలల క్రితం కుమారుడు పుట్టాడు. వినాయకచవితి పర్వదినం సందర్భంగా గ్రామంలో ఉన్న కొడుకునుచూసేందుకు మాసాయిపేటకు బైక్‌పై వెళుతుండగా రామాపురం వద్ద ఐస్ బండి ఢీకొంది. ప్రమాదంలో రోడ్డుపై పడగా అదే సమయంలో అటు వెళుతున్న కారు సామ్యేల్‌పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవరావు తెలిపారు. కాగా పండగ పూట ఇంటికి భర్త వస్తాడనుకున్న ఎదురు చూస్తున్న భార్యకు మృతి వార్త తెలిసి కన్నీరు మున్నీరుగా విలపించింది.

నదీ జలాలతోనే ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారం

- మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్
- ముస్లిం మైనార్టీల్లో అక్షరాస్యత పెరగాలి
- విద్యతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల అభివృద్ధి సాధ్యం
- ఐక్యతా విజయ పథం యాత్రకు విశేష స్పందన



బహిరంగ సభలో మాట్లాడుతున్న మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్

కనిగిరి రూరల్: కనిగిరి ప్రాంత ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం నదీ జలాలతోనే సాధ్యమని మాజీ ఐఏఎస్ అధికారి జీఎస్‌ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ అన్నారు. ఐక్యతా విజయ పథం యాత్రలో భాగంగా సోమ, మంగళవారాల్లో ఆయన కనిగిరిలో పర్యటించారు. సోమవారం స్థానిక పామూరు బస్టాండ్ సెంటర్ వద్ద బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తాను కలెక్టర్‌గా పని చేసిన సమయంలో ప్రజలకి దగ్గరగా పని చేసిన సందర్భాలు గుర్తు వస్తున్నాయని, ప్రజావాణి, అక్షర విజయం ద్వారా ప్రజలకి దగర అయ్యానన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి అనేక చర్యలు తీసుకున్నామని, అనేక పరిశోధనల తర్వాత నది జలాల పంపిణీ మాత్రమే పరిష్కారానికై ఏకైక మార్గం అని పేర్కొన్నట్లు చెప్పారు. వివేకాం ఫౌండర్ ప్రెసిడెంట్ విజయశ్రీ మాట్లాడుతూ ఎన్నో కిలో మీటర్లు దాటుకొని యాత్ర కనిగిరికి వచ్చిందని, విశేష ప్రజాదారణ లభిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి చోట అన్ని వర్గాల ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు.

షాదీఖానాలో ముస్లిం ఆత్మీయ సదస్సు

అనంతరం స్థానిక షాదీఖానాలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన ముస్లింల ఆత్మీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాజీ కలెక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏదో ఒక కారణం చూపి కొందర్ని దోషులుగా చూపే కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్వేష ప్రసంగాల పట్ల ఎంతో అప్రమత్తత అవసరం అని స్పష్టం చేశారు. ఏదో కారణాలతో చట్టాలు తెచ్చి వాటిలో కొన్నింటిని మైనారిటీలపై ఎక్కు పెట్టే దురుద్దేశాలను ఐక్యతతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మైనార్టీ వర్గాలు ఉన్నత విద్యావంతులుగా మారాలని ఆకాంక్షించారు. ముస్లిం మైనార్టీల్లో అక్షరాస్యత పెరగాలని పిలుపునిచ్చారు. తొలిరోజు యాత్రకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు, మహిళ సంఘాలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, ఏపీ ఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, కౌన్సిలర్లు, విశ్రాంత ఎంఈఓ మస్తాన్ వలి, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే ఖాశిం సాహెబ్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో శిద్దా సుధీర్ దంపతులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో శిద్దా సుధీర్ దంపతులు

ఒంగోలు టౌన్: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో టీటీడీ సభ్యులు శిద్దా సుధీర్ దంపతులు వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవార శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయం రంగనాయక మండపంలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన నూతన పాలక మండలి సభ్యులు ముఖ్యమంత్రిని కలిశారు. అనంతరం శిద్దా దంపతులుస్వామివారిని దర్శించుకున్నారు.వేద ఆశీర్వాదాలతో తీర్థప్రసాదాలనుఅందజేశారు.

గాంధీ జయంతికి లక్షన్నర మొక్కలు

- జిల్లాలో ఎవెన్యూ ప్లాంటేషన్ లక్ష్యం 172.5 కిలోమీటర్లు
- రూఫ్ టాప్ హార్వెస్టింగ్ పనులను వేగంగా చేపట్టాలి
- మండల స్థాయి అధికారుల సమీక్షలో కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎవెన్యూ ప్లాంటేషన్ విజయవంతం చేసేందుకు అవసరమైన చర్యలపై దృష్టి సారించాలని మండల స్థాయి అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. దీనికి సంబంధించి అనుమతులు వారంలో తీసుకోవాలని చెప్పారు. మంగళవారం ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదీన జిల్లా వ్యాప్తంగా 175.2 కి.మీ పొడవున ఎవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆ రోజున లక్షన్నర మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. మంజూరైన రూఫ్ టాప్ హార్వెస్టింగ్ పనులను త్వరగా చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో నిర్దేశించిన లక్ష్యాలను కచ్చితంగా సాధించాలన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను పూర్తి చేసి సంబంధిత శాఖలకు అప్పగించాలని ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను సమగ్రంగా నిర్వహించాలన్నారు. కేస్ షీట్స్ రూపొందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాడు-నేడు, జగనన్న కాలనీల్లో నిర్మాణాలు వేగంగా పూర్తి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, జిల్లా మలేరియా నివారణ అధికారి జ్ఞానశ్రీ, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, హౌసింగ్ పీడీ పేరయ్య, డ్వామా పీడీ శీనారెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఈఓ సుబ్బారావు, జెడ్పీ సీఈఓ జాలి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

- 10 మందికి స్వల్ప గాయాలు



రోడ్డు పక్కన పొలంలో పడిపోయిన ఆర్టీసీ ఇంద్ర బస్సు




చికిత్స పొందుతున్న ఆదిలక్ష్మి

యర్రగొండపాలెం: స్థానిక మార్కాపురం రోడ్డులోని పాల కేంద్రానికి సమీపంలో మంగళవారం ఆర్టీసీ ఇంద్ర బస్సు బోల్తా పడింది. ఈ సంఘటనలో 10 మందికి గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి మార్కాపురం వెళ్తున్న ఆర్టీసీ ఇంద్ర బస్సు ప్రైవేట్ పాలకేంద్రానికి సమీపంలోని హైవే రోడ్డుపై ఎదురుగా వస్తున్న లారీని డ్రైవర్ తప్పించే క్రమంలో అదుపు తప్పింది. పక్కనే ఉన్న చప్టాకు ఢీకొని పొలాల్లో బోల్తా పడింది. డ్రైవర్ నాగేశ్వరరావు కాలికి, కనిగిరికి చెందిన ప్రయాణికురాలు డి.ఆదిలక్ష్మికి తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. మార్కాపురానికి చెందిన 8 మంది ప్రయాణికులు ధరణి, సురేంద్ర శ్రీనివాస్, మంత్రయ్య, చెన్నమ్మ, భువన్‌కుమార్, పోతిరెడ్డి, మహబూబ్‌బాష, బస్సు హెల్పర్ ఇస్సాక్‌లకు స్వల్పంగా గాయాలయ్యాయి. గాయపడిన వీరిని 108లో స్థానిక ఏరియా వైద్యశాలలో చేర్పించి చికిత్స చేయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

గొర్రెల కాపరి దారుణ హత్య



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మార్కాపురం డీఎస్పీ, ఎస్సై



మృతి చెందిన చెన్నయ్య

మార్కాపురం రూరల్: గొర్రెల కాపరి దారుణ హత్యకు గురైన ఘటన మంగళవారం ఉదయం మార్కాపురం మండలంలోని ఇడుపూరు గ్రామ శివారులో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. ఇడుపూరు గ్రామానికి చెందిన సాగనబోయిన చెన్నయ్య(62) సోమవారం రాత్రి యథావిధిగా గొర్రెలను తీసుకుని పొలానికి వెళ్లాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్తులు చెన్నయ్య విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించారు. శరీరంపై తీవ్రగాయాలు ఉండటంతో హత్యగా భావించి రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి, మార్కాపురం ఇన్‌చార్జి సీఐ దేవప్రభాకర్, ఎస్సై పరిశీలించారు. వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. ఆయన మృతిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఎల్లమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

23న ఇగ్నైట్ యంగ్ మైండ్స్ జిల్లా స్థాయి పోటీలు



ఎంఈఓలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: ఇగ్నైట్ యంగ్ మైండ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 23న మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి పోటీలు పకడ్బందీగా నిర్వహించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. సోమవారం తన నివాసంలో ఎంఈఓలు, హెచ్‌ఎంలతో పోటీల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను, సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ఇగ్నైట్ యంగ్ మైండ్స్ ఆధ్వర్యంలో ప్రతి నెలా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఫోక్ డ్యాన్స్, క్విజ్, వ్యాసరచన విభాగాల్లో పోటీలకు హాజరయ్యే విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ, భోజన వసతి, ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలపై కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. మార్కాపురం, తర్లుపాడు ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు అచ్యుత సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్, సత్యనారాయణ, మండ్లా రామాంజనేయులు, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నలుగురు అరెస్టు

ఒంగోలు టౌన్: నగరంలోని కర్నూలు రోడ్డులో మదన్ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద మూడు రోజుల క్రితం చోటుచేసుకున్న ఘర్షణకు సంబంధించి హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం సాయంత్రం నిందితులను అరెస్టు చేశారు. నిందితుల వివరాలను డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఒంగోలుకు చెందిన షేక్ సాహుల్, పేర్లి విజయవర్ధన్ రాజు, షేక్ కరిముల్లా, మల్లవరపు శివ ఈనెల 15వ తేదీ రాత్రి మదన్ రెస్టారెంట్ వద్ద ఉన్న కైలా రమేష్, అంజయ్యతో ఘర్షణపడ్డారు. వారిద్దరిపై దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం ముంగమూరు రోడ్డు జంక్షన్ వద్ద నలుగురు నిందితులను అరెస్టు చేశారు.